ప్రజాశక్తి
మంగళవారం 25 ఏప్రిల్ 2023
5
పార్వతీపురం మన్యం

26న వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఉద్యాన కళాశాలలో ఈనెల 26న వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించనున్నట్లు సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఎం.సురేష్ కుమార్ తెలి పారు. ఈ మేరకు ఒక ప్రకటన సోమవారం విడుదల చేశారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నత పర్వత శ్రేణి గిరిజన మండల వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశానికి జిల్లా స్థాయి అధికారులు, ఆంగ్రూ వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి, విస్తరణ సంచాలకులు సుబ్బిరాం రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్తలు, వ్యవసాయ ఉద్యాన అనుబంధ రంగాల అధికారులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అంకితభావంతో మంచి సేవలు అందిస్తే వాటికి ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో ప్రకటించిన ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచులకు బహుమతులను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన 14 గ్రామ పంచాయతీలు ర్యాంకులు సాధించడం పట్ల అభినందించారు. ఇదే పనితీరు కనబరిచి మరిన్ని అవార్డులు పొందాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో డిపిఒ బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చడమే ధ్యేయంగా పనిచేస్తున్నానని మండలంలోని పెదగొత్తిలి సర్పంచ్ టి.లోకనాథం అన్నారు. జిల్లా అధికారులు విడుదల చేసిన ఉత్తమ పంచాయతీలు జాబితాలో తమ పంచాయతీకి అరుదైన గౌరవం దక్కడం చాలా సంతోషంగా ఉందని, సోమవారం కలెక్టరేట్‌లో అవార్డును అందుకున్నానని అన్నారు. ఈ అవార్డు మరింత బాధ్యతలు పెంచిందన్నారు. రానున్న రోజుల్లో ఇంకా కష్టపడి పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. అలాగే తనకు సహకరించిన ప్రజలకు, సచివాలయ సిబ్బందికి వాలంటీర్లకు అభినందనలు తెలిపారు.

జియమ్మవలస: మండలంలోని ఉత్తమ పంచాయతీలుగా ఎన్నికైన బిత్రపాడు, పిప్పల భద్ర, జియమ్మవలస గ్రామ పంచాయతీల సర్పంచులను ఎంపిడిఒ ఎన్.రమేష్ సన్మానించారు. సర్పంచులు గుంట్రెడ్డి శ్రీనివాసరావు, వాన రాజు, ఈదెల రామును సన్మానించి వారికి ప్రశంస పత్రాలను ఎంపిడిఒ అందించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీల సర్పంచులకు అవార్డులు అందజేసిన కలెక్టర్ నిశాంత్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం : ఉత్తమ ఆరోగ్యవంతమైన పంచాయతీగా గుమ్మలక్ష్మీపురం పంచాయతీ ఎంపికైనది. ఈ మేరకు కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతుల మీదు సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావుకు నేషనల్ పంచాయతీ అవార్డు జ్ఞాపికను అందజేశారు. సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈ ఉత్తమ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. పంచాయతీ ప్రజలు, కార్యదర్శి కిషోర్ కుమార్, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది తనకు అన్నివేళలా సహాయ సహకారాలు అందించినందుకు కతజ్ఞతలు తెలిపారు.

బలిజిపేట : మండలంలోని మిర్తివలసకు ఉత్తమ పంచాయతీ అవార్డును ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆ గ్రామ సర్పంచ్ దూడి భాస్కరరావు కలెక్టర్ నితీష్ కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సాలువా, మెమోంటోతో ఘనంగా ఆయన్ను సత్కరించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగుల సహాయ సహకారాలతో గ్రామ అభివృద్ధికి ఎంతగానో అన్నారని, కావున ప్రభుత్వం తమ గ్రామానికి ఈ అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందని తెలిపారు.

బిజెపిని గద్దెదించకపోతే ప్రమాదం

ప్రచారభేరిలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

బిజెపిని గద్దె దించకపోతే దేశం మరింత ప్రమాదంలో పడిపోతుందని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు రెడ్డి వేణు, కె.మన్మధరావు హెచ్చరించారు. బిజెపిని నమ్మితే రాజకీయ పార్టీలకే కాకుండా ప్రజలకు బతుకు లేకుండా చేస్తుందన్నారు. బిజెపిని సాగనంపుదాం... దేశాన్ని కాపాడుకుందాం అన్న పేరుతో వామపక్షాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో స్టాండ్ ఆవరణలో సోమవారం జరిగిన ప్రచార భేరి బహిరంగ సభలో వారు మాట్లాడారు. కార్పొరేట్ హిందుత్వ బిజెపికి విధానపరమైన ప్రత్యామ్నాయంతో ప్రతిపక్షాలన్నీ ఏకమైతే మోడీ ప్రభుత్వాన్ని సాగనంపవచ్చని అన్నారు. అధికారం కోసం బిజెపిని నమ్మిన ఏ రాజకీయ పార్టీ అయినా నిలువునా మునిగిపోవడం ఖాయమన్నారు. అధికారంలోకి రాగానే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ ఆ హామీ నిలబెట్టుకోకపోగా ఉన్న ఉద్యోగులను తొలగిస్తున్నారని, కొత్తగా ఒక పరిశ్రమను ఏర్పాటు చేయకపోగా ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌక కార్పొరేట్లకు అమ్మేస్తున్నారని తెలిపారు. రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు ప్రైవేట్ వారికి కట్టబెడుతున్నారని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేసేందుకు కుయుక్తులు పన్నుతుందని విమర్శించారు. వ్యవసాయ నల్ల

సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు పోరాడి విజయం సాధించారని, ఇదే స్ఫూర్తితో బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తుందని, ఎక్కడ అధికార, ప్రతిపక్షాలు ప్రశ్నించకపోవడం సరికాదని అన్నారు. మోడీ చెప్పుల్లో కాలు పెట్టి జగన్ నడుస్తున్నారని విమర్శించారు. గతంలో చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే ఉందన్నారు. దేశ ప్రయోజనాలను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించే పార్టీలకు వామపక్షాల అండగా నిలుస్తాయన్నారు. బిజెపిని ఓడించేందుకు వామపక్షాలు ముందుండ పోరాడుతున్నాయన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు అధ్యక్షత సభలో వామపక్ష నాయకులు దావాల రమణారావు, జి.జనార్ధనరావు, జీలకర్ర సుందరమ్మ, పాలక సాంబయ్య, బిడ్డిక అప్పారావు, జి. జగన్నాథులు, మిన్నారావు, కాద రాము, ఎ.లక్ష్మణరావు, ఎస్.నారాయణరావు, ఎం.రమేష్, ఒరియా, చిన్నారావు, గబ్రిలు, దూసి దుర్గారావు, బి.పట్టాభి, ఎం.లక్ష్మణరావు, ఎం.కాంతారావు, ఎస్. సురేష్, సిపిఎం కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎంపిపి ప్రమీలకు జ్ఞాపికను అందజేస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ఉత్తమ ఎంపిపిగా ప్రమీల

ప్రజాశక్తి - పాచిపెంట

ఉత్తమ ఎంపిపిగా స్థానిక ఎంపిపి బి.ప్రమీల ఎంపికయ్యారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతులు మీదుగా ఉత్తమ ఎంపిపి అవార్డును అందుకున్నారు. మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపిపికి జెడ్పీ చైర్మన్ సూచించారు. అనంతరం ఎంపిపి డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరకు, జెడ్పీ చైర్మన్‌కు, వైసిపి జిల్లా కార్యదర్శి వీరంనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

పక్కాగా స్ప్రేయింగ్ చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో మలేరియా వ్యాప్తి జరగకుండా స్ప్రేయింగ్ పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సోమ వారం సమీక్షించారు. మే, జూన్, జూలై స్ప్రేయింగ్ జరగాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ, పంచాయతీ, స్వయం సహాయక సంఘాలు తదితర విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. నిర్దేశిత గ్రామాల్లో ప్రతి ఇంటా బయటా మొత్తం స్ప్రేయింగ్ చేయాలని ఆయన స్పష్టం చేశారు. స్ప్రేయింగ్‌ను తీవ్రంగా పరిగణించాలని ఆయన ఆదేశించారు. స్ప్రేయింగ్ సక్రమంగా జరగకపోతే మలేరియా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని, అటువంటి పరిస్థితి జిల్లాలో తలెత్తరాదని ఆయన అన్నారు. జిల్లా అధికారులు తమ శాఖకు సంబంధించిన అన్ని విషయాలు స్పష్టంగా సమీక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, మార్గదర్శకాలు ఎక్కడా లోపాలు లేకుండా అమలు చేయాలన్నారు. జిల్లా అధికారుల స్థాయిలో పరిష్కారంకాని సమస్యలను తన దృష్టిలో పెట్టాలని ఆయన సూచించారు. వై.ఎస్.ఆర్ యంత్ర సేవా కేంద్రాల (కస్టమ్ హైర్ కేంద్రాలు) ఏర్పాటుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. జల జీవన్ మిషన్ పనులు, క్రాష్ కార్యక్రమం పనులు త్వరగా పూర్తి చేయాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి జన ఔషధి కార్యక్రమం వివరాలు అప్ డేట్ చేయడం, ఆరేళ్లలోపు పిల్లల ఆధార్ అప్ డేట్ చేయడంలో అశ్రద్ధ వహించరాదనిస్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం కలుగకుండా జనరేటర్ సపోర్ట్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ విభాగాన్ని పర్యవేక్షించుటకు ప్రత్యేకంగా ఒక వ్యక్తిని బాధ్యుడుగా పెట్టాలని ఆయన ఆదేశించారు.

ఆసుపత్రులను తనిఖీ చేయాలి-కలెక్టర్

వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, సబ్ కలెక్టర్ తరచూ తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రుల్లో అన్ని పరికరాలు వినియోగంలో ఉన్నది లేనిది పరిశీలించాలన్నారు. అల్ట్రా స్కానింగ్ కొన్ని చోట్ల ప్రింట్ రావడం లేదని వాటిని పునరుద్ధరణ చేయాలని పేర్కొన్నారు. బేబీ వార్మర్ల పనితీరు చూడాలని, పనిచేయకపోతే వాటిని తక్షణం మరమ్మతులు చేయించాలని అన్నారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మరియు ఇన్ ఛార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల ప్రారంభానికి పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

రానున్న విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర టెక్స్ట్ బుక్స్ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోనే 45 వేల పాఠశాలలు ఉన్నాయని, 42 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలిపారు. వీరి కోసం నాలుగు కోట్ల పాఠ్యపుస్తకాలు ముద్రణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆరు, ఏడు తరగతులకు సంబంధించి ఇంగ్లీషు, లెక్కలు, సైన్సు మార్చుతున్నట్టు తెలిపారు. ఈ ఏడాది రెండు సెమిస్టర్లు ఉంటాయని స్పష్టం చేశారు. సిబిఎస్ఇ సిలబస్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థులకు కొత్తగా పాఠ్యపుస్తకాలు ముద్రిస్తున్నట్టు తెలిపారు. మండలాల్లో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ల ద్వారా నేరుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ పంపిణీలో ఎటువంటి లోపాలున్నా గుర్తించి ఆ సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కెజిబివి పాఠశాల, పలు ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు.

రక్త హీనత నివారణకు కార్యాచరణ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో శిశువులు, బాలికలు, గర్భిణీలు, బాలింతలలో రక్తహీనత నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం వైద్య, ఆరోగ్యశాఖ, విద్యాశాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు ఎం.టి.కృష్ణబాబు, ప్రవీణ్ ప్రకాష్ పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు, అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శిశువులు, బాలికలు, గర్భిణీలు, బాలింతల్లో రక్తహీనత నివారణకు రూపొందించిన కార్యాచరణను అమలుచేయాలని, విద్యాశాఖ, వైద్యశాఖ, మాతా శిశు సంక్షేమ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, పౌష్టికాహారం,రక్తహీనత మాత్రలు సక్రమంగా పంపిణీచేయాలని తెలిపారు. అనంతరం కలెక్టరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.రక్తహీనత నివారణకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిహెచ్‌సిల పరిధిలో రక్త హీనత పరీక్షలు చేయాలని, గణాంకాలు వాస్తవంగా ఉండాలని ఆదేశించారు. రక్తహీనత నివారణకు అందించే మందులు అంగన్వాడీ కార్యకర్త వద్దగల స్టాకు వివరాలు ఎఎన్ఎం వద్ద గల యాప్ నందు నమోదు చేయాలని తెలిపారు. హై రిస్క్ గర్భిణీలను నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. టీకాల కార్యక్రమం శత శాతం జరగాలని, ప్రతి ఒక్కరి వద్ద టీకాల కార్డు ఉండాలని, రికార్డులు పక్కాగా నిర్వహించాలని ఆయన చెప్పారు. ఆసుపత్రుల్లో ప్రసవాలు జరగాలని, గర్భిణీలకు ఆరోగ్య కార్డులు ఉండాలని అన్నారు.ఆసుపత్రుల్లో కరెంటు అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎపిఎంఐడిసి పార్వతీపురం, సాలూరు, కురుపాం, భద్రగిరి లలో చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బగాది జగన్నాథరావు, డిహెచ్‌సిఒ బి.వాగ్దేవి, ఆర్.బి.ఎస్.కె పీడీ డి.భాస్కరరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డివి రమణ, ప్రోగ్రాం అధికారి వినోద్, ఇన్‌ఛార్జి డిఇఒ పి.వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ పీడీ కె.విజయగౌరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

వీరఘట్టం : విద్యాశాఖ అధికారుల అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ జెఎసి పిలుపు మేరకు మండలంలోని కిమ్మి ఎంపియుపి పాఠశాలలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సస్పెన్షన్లు రద్దు చేయాలని, తదితర అంశాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.పారినాయుడు, పైడ్రాజు, కె.గౌరినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మన్మథరావు

మేడేను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - కలెక్టరేట్

కార్మికుల హక్కు దీక్షా దినమైన మేడేను జిల్లా వ్యాప్తంగా పట్టణ, మండల కేంద్రాల్లో, పారిశ్రామిక ప్రాంతంలోని జెండా ఆవిష్కరణలు,ప్రదర్శనలు నిర్వహించాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. మేడే సన్నాహక సమావేశం స్థానిక సుందరయ్య భవనంలో వివిధ కార్మికుల నాయకులతో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న పని గంటలు, హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. కార్మిక చట్టాలు రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకువచ్చిందనీ, ఈజ్ ఆఫ్ జాబ్ డూయింగ్ పేరుతో కార్మికులకు తక్కువ వేతనాలు ఇచ్చి ఎక్కువ పని చేయించుకోవడానికి కార్మిక చట్టాలు సవరణ చేసి కార్పొరేట్లకు పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలు చేస్తుందన్నారు. అందులో భాగంగానే స్టీల్ ప్లాంట్లు రైల్వే, ఎల్ఐసి ఎయిర్లైన్స్ బొగ్గు ప్రభుత్వ ప్రకతి ఖనిజాలు కార్పొరేట్లకు పెట్టుబడుదారులకు ధారాదత్తం చేస్తూ ప్రైవేటుపరం చేస్తుందని విమర్శించారు. కావున కార్మిక వర్గం మేడేను జయప్రదం చేయాలని, కార్మిక వర్గం ఐక్య పోరాటాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు కోశాధికారి జి.వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ అధ్యక్షులు హరినాథ్, 104 యూనియన్‌న ఆయకులు ఆలు సోమనాయుడు, చౌక్కాపూర్ మౌళి, ఆటో కార్మికులు శ్రీనివాసరావు, అప్పారావు, తోపుడుబండ్ల యూనియన్ నాయకులు శ్రీను, సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం

నీటిపారుదల శాఖామంత్రి అంబటి • పెండింగ్ ప్రాజెక్టులపై సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

జలయజ్ఞంలో భాగంగా జిల్లాలో చేపట్టిన తోటపల్లి, తారకరామతీర్ధ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని రాష్ట్ర నీటి పారుదల శాఖామంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ సాగునీటి ప్రాజెక్టులపై సోమవారం కలెక్టరేట్‌లో మంత్రి బొత్స సత్యనారాయణతో కలిసి మంత్రి రాంబాబు సమీక్షించారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులను కలెక్టర్ నాగలక్ష్మి, జలవనరులశాఖ ఎస్ఇ ఎస్.సుగుణాకర రావు ముందుగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, తారకరామ తీర్ధసాగర్, తోటపల్లి ప్రాజెక్టులు జిల్లా పురోభివృద్ధికి ఎంతో కీలకమని చెప్పారు. తోటపల్లి ప్రాజెక్టు పూర్తి అయితే విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలో వేలాది ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని చెప్పారు. లక్షా, 31వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఈ ప్రాజెక్టు వల్ల మూడు జిల్లాల్లో ప్రస్తుతం 83,000 ఎకరాలకు మాత్రమే నీరు అందుతోందని చెప్పారు. సుమారు రూ.267 కోట్లతో పెండింగ్ పనులను పూర్తి చేస్తే, మిగిలిన 48వేల ఎకరాలకు, ముఖ్యంగా శివారు భూములకు కూడా సాగునీరు అందుతుందని వివరించారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, గజపతినగరం బ్రాంచ్ కెనాల్, పెద్దగెడ్డ, ఒట్టిగెడ్డ, వెంగళరాయ సాగర్ పనులను కూడా చేపట్టాల్సి ఉందని చెప్పారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ తోటపల్లి, తారకరామ తీర్ధసాగర్ పనుల నిర్వహణకు నిధులను కేటాయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముందుగా సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులతో సమావేశాన్ని నిర్వహించి, సమగ్ర ప్రణాళికను రూపొందించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈప్రాజెక్టులకు సంబంధించి, ముఖ్యమంత్రి స్థాయిలో త్వరలో ఒక సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్ఎలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఐ.రఘురాజు నీటిపారుదల శాఖ ఇఎన్‌సి నారాయణరెడ్డి, జెసి మయూర్ అశోక్, డిఆర్ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ ప్రాజెక్టుల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న నీటిపారుదల శాఖా మంత్రి అంబటి రాంబాబు

వినతులకు సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశకిత - కలెక్టరేట్

స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే అర్జీలపై నేరుగా మాట్లాడి వారు సంతప్తి చెందేలా పరిష్కారం చూపాలనికలెక్టరు నిశాంత్ కుమార్ అదికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరు, ఇంచార్జి జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో 94 దరఖాస్తులు అందాయి. ప్రజలు అందించిన వ్యక్తిగత, సామాజిక అర్జీలు వివరాలు ఈ విధంగా ఉన్నాయి

కొమరాడ మండలం మర్రిగూడలో పాఠశాల, అంగన్వాడీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని గ్రామానికి చెందిన నిమ్మక చంద్రశేఖర్ దరఖాస్తు అందజేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉపాధి హామీ పనుల వద్ద నీడ కొరకు టెంట్లు, మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలని, పనిలోకి రాని వారికి కూడా హాజరు వేస్తున్నారని వీటిపై చర్యలు చేపట్టాలని, బలిజిపేట మండలం వెంగళరాయపురం, జనార్ధనవలస గ్రామాలకు పరిశుభ్రమైన తాగునీరందించాలని, పార్వతీపురం మండలం పెదమరికి, చినమరికి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని,మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అర్జీ అందజేశారు. కొమరాడ మండలం సివిని గ్రామంలో రీ సర్వే చేసి పాస్ పుస్తకాలిచ్చినా వాటిలో అనేక పొరపాట్లు ఉన్నాయని, తప్పులు సవరించాలని గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. అలాగే మర్రిగూడలో తాగునీటి సరఫరాకు ట్యాంకర్‌ను మంజూరు చేయాలని బిడ్డిక రమేష్, గ్రామస్తులు కోరారు.

ఫిర్యాదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఇదే గ్రామానికి చెందిన నిమ్మక నవీన్ పాలెం జంక్షన్ నుండి రావికోన వరకు బీటీ రోడ్ మంజూరు చేయాలని కోరారు. జియ్యమ్మవలస మండలం వీరబ్రహ్మేంద్రపురానికి విద్యుత్ సమస్య పరిష్కరించాలని వి.రామకష్ణ దరఖాస్తు అందజేశారు. సాలూరు మండలం దళాయివలస త్రీఫేస్ కరెంట్ లైన్, కొత్త వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలని ఎం.కామయ్య, రైతులు కోరారు. బొబ్బిలి మండలం గోపాల రాయుడుపేట పంచాయితీలో గల మోసేవలసను సీతానగరం మండలం ఆర్.వెంకంపేట పంచాయతీలో చేర్పించాలని ఎం.రోహిణి, గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర

• అనుమతుల్లేకుండా నాలుగు అంతస్థుల భవనాలు
• చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

డివిజన్ కేంద్రమైన పాలకొండ నగర పంచాయతీలో భవన నిర్మాణాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. నిబంధనలకు పాతర వేసి భవనాలు నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించి నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఎటువంటి అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై అధికారులు కూడా చోద్యం చూస్తున్నారు. నగర పంచాయతీలో జిపిఎస్-2 పైబడి నిర్మించుకుంటే కచ్చితంగా సుడా అనుమతులు తీసుకోవాల్సి ఉంది. 30 అడుగుల రహదారితో పాటు చెక్‌బాక్స్, అగ్ని ప్రమాద నివారణ సామాగ్రితో పాటు అండర్ గ్రౌండ్ వాటర్ ట్యాంకు కచ్చితంగా ఉండాల్సి ఉంది. అయితే ప్రస్తుతం నిర్మిస్తున్న భవనాలకు అటువంటివి ఏమీ లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టణంలో సీతంపేట రోడ్డులో జిపిఎస్-4 అంతస్తుల భవనాలను నిర్మాణాలు జరుగుతున్నా వాటికి ఎటువంటి అనుమతులు లేవు. జిపిఎస్-2 వరకు అనుమతులు పొంది ఇష్టారాజ్యంగా వ్యవహరించి నిర్మాణాలు చేపడుతున్నారు. కనీసం వాహనం వెళ్లడానికి కూడా రహదారి లేకపోయినప్పటికీ నాలుగు అంతస్తుల భవనాలు నిలుస్తున్నాయి.

పట్టించుకోని అధికారులు....

ఎటువంటి నిబంధనలు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలు తుంగలోకి తొక్కి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నా అడిగేతే నాధుడే లేడు. దీంతో సంబంధిత అధికారులపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. నగర పంచాయతీకి చెందిన ఒక ప్రైయివేట్ సర్వేయర్ మధ్యవర్తిగా వ్యవహరించి అడ్డదారి నిర్మాణాలకు సహకరిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



సీతంపేట రోడ్డులో నిర్మితమవుతున్న నాలుగు అంతస్తుల భవనం

మజ్జిగ పంపిణీ

పాలకొండ రూరల్: మండలం, పట్టణంలో సంచార చలివేంద్ర మజ్జిగ పంపిణీ కార్యక్రమం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా సత్యసాయి సమితి సభ్యులు మాట్లాడుతూ ఎండ తీవ్రతకు ప్రయాణికులు, ప్రజలకు ఉపశమనం కలిగేలా విడంగా చేయడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో సంచార చలివేంద్ర కన్వీనర్ కె. సుధాకర్, సేవకులు జడ్డు రామానంద్, తవిటిరాజు, సాయి పాల్గొన్నారు.

రేపు ఉన్నత పర్వత శ్రేణి సమావేశం

సీతంపేట: ఈనెల 26న ఉన్నత పర్వత శ్రేణి ఎత్తైన గిరిజన మండలి వ్యవసాయ పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహిస్తున్నట్టు గిరిజన మండల సహ పరిశోధన సంచాలకులు ఎం. సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో తోటపల్లిలో ఉన్న ఉద్యానవన కళాశాలలో జరుగుతున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు శాస్త్రవేత్తలు రైతులు పాలుపంచుకుంటారని చెప్పారు. రబీ పంటలకు అవసరమైన ప్రణాళికలు తెలియజేస్తామని తెలిపారు.

గిరిజన గ్రామాల్లో 'ఇదేం కర్మ'

సీతంపేట: మండలంలోని ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం సోమవారం పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిలగాం పంచాయతీలో శిలగాం, లక్కాయి గూడ, పాలమానుగూడ, జల్లంగూడ తదితర గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏ సమస్యలూ పరిష్కరించడం లేదని విమర్శించారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల వారికి సమాన పాలన అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్టి సెల్ రాష్ట్ర కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, సీనియర్ నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని చెల్లంనాయుడువలసలో సోమవారం టిడిపి ఆధ్వర్యంలో ఇదేమి కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని ధరలు పెరిగాయని, అవినీతి, హత్యలు పెరిగాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం విధానాలు వ్యతిరేకించే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు కె.తిరుపతిరావు, ఆర్.వేణుగోపాలనాయుడు, బి.శ్రీనివాసరావు, పెదబాబులు, సర్పంచి మండల పార్టీ నాయకులు ఎస్.హరిగోపాలరావు, ఎం.శంకర్రావు, గ్రామ కమిటీ సభ్యులు డి.సింహాచలం, వి.పారినాయుడుతో పాటు పలువురు పాల్గొన్నారు

జాతీయ స్థాయి ఉషు పోటీలకు ఎంపిక

కీర్తికను అభినందిస్తున్న ఉషు అధ్యక్షులు రెడ్డి శివకుమార్

భామిని: మండలంలోని తాలాడ గ్రామానికి చెందిన వలురౌతు ఇందు కీర్తిక జాతీయ స్థాయి ఉషు పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 23న గుంటూరులో నల్లపాడు వేదికగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ ఉషు పోటీల్లో 70 కిలోల విభాగంలో స్వర్ణ పతకం సాధించి, మే 30న పూణేలో జరగబోవు జాతీయ స్థాయి ఉషు పోటీలకు అర్హత సాధించింది. ఈమె ప్రస్తుతం పాలిటెక్నిక్‌లో ఫైనల్ ఇయర్ చదువుంది. తల్లి బి. శారద భామిని కెజిబివిలో ఎస్ఒగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి ఉషు పోటీలకు అర్హత సాధించిన ఇందు కీర్తికను శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా ఉషు అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డి శివకుమార్ అభినందనలు తెలిపారు.

పేదల భూమిని థర్మల్ ప్లాంట్‌కు ఇవ్వొద్దు

పార్వతీపురం రూరల్ : పేదలు సాగు చేసుకుంటున్న డి-పట్టా భూములను థర్మల్ ప్లాంట్‌కు కేటాయిస్తూ సిసిఎల్ఎ తీర్మానం చేయడానికి వ్యతిరేకిస్తున్నామని రైతు కూలీ సంఘం కార్యదర్శి డి.వర్మ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలు సాగు చేస్తున్న డి -పట్టా భూములను కోటిపాం థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఇచ్చేందుకు సిసిఎల్ఎ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. గతంలో 642 ఎకరాలు, ఇప్పుడు మరో 32 ఎకరాల భూమిని థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్న రెవెన్యూ యంత్రాంగం చర్యలను ఆపాలని, భూమికి భూమి కేటాయించి పేదలకు జీవించే భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఒకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం సహాయ కార్యదర్శులు పి .శ్రీనునాయుడు, ఎం.భాస్కరరావు, జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు, కోటిపాం, గుమ్మడి అగ్రహారం, కొమరాడ, గుమడ గ్రామాల నుండి ప్రజలు పాల్గొన్నారు. తొలుత రైతు కూలీ సంఘ కార్యాలయం నుంచి కాంప్లెక్స్ మీదుగా ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ఊరేగింపు జరిగింది.

పాలకొండలో వర్షం

పాలకొండ: పట్టణంలో సోమవారం సాయంత్రం మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు సాయంత్రం కురిసిన వర్షం కొంత ఊరటనిచ్చింది. సుమారు అరగంటసేపు వర్షం కురవడంతో ప్రజలు రాకపోకలకు కొంత ఆటంకం కలిగింది.

సాగు పట్టాలు ఇవ్వాలని వినతి

పాచిపెంట : మండలంలోని కొటికిపెంట పంచాయితీ కొత్తపేట, వడిసెలమడ గిరిజన రైతులు గత 60ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు సాగు పట్టాలు మంజూరు చేయాలని సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల రైతులు సోమవారం స్థానిక తహశీల్దార్ బి.రాజశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పలనాయుడు మాట్లాడుతూ గత 60 ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు సాగు పట్టాలు అందజేయాలని కోరారు. సాగు పట్టాల్లేకపోవడంతో రైతు భరోసా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందడంలేదని, వీరి సమస్యపై దృష్టి సారించి సాగు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గిరిజన గ్రామాలు రైతులు పాల్గొన్నారు.

అచ్చెన్నను కలిసిన తిరుపతిరావు

అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న తిరుపతిరావు

మక్కువ: టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడును టిడిపి మండల మాజీ అధ్యక్షులు పెంట తిరుపతిరావు సోమవారం శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాలూరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని అచ్చెన్నాయుడు దృష్టికి తిరుపతిరావు తీసుకెళ్లారు. టిడిపి బలోపేతానికి కృషి చేయాలని, విభేదాలకు తావు లేకుండా అంతా కలిసి పనిచేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో శంబర ఎంపిటిసి సభ్యులు తీళ్ల పోలినాయుడు, టిడిపి సీనియన్ నాయకులు చొక్కాపు బుచ్చినాయుడు తదితరులు పాల్గొన్నారు.

భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలి

కలెక్టరేట్ : డిగ్రీ ఫైనల్ ఇయర్ ఆరో సెమిస్టర్‌లో భాగంగా మూడు నెలల పాటు చేయాల్సిన ఇంటెర్న్ షిప్ కాలంలో గిరిజన విద్యార్థులకు భోజనం, వసతి సౌకర్యాలు కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం వార్షిక పరీక్షలు రాసిన గిరిజన విద్యార్థులతో కలిసి గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు బి.సూర్యనారాయణను కలిసి వినతిని అందజేశారు. ఈనెలాఖరుతో గిరిజన కళాశాల వసతి గృహాలకు సెలవుల నేపథ్యంలో "ఇంటెర్న్ షిప్ "కాలానికి అనుగుణంగా జూలై 6 వరకు గిరిజన విద్యార్థులకు వసతి గృహాలు తెరిచి ఉంచి భోజనాలు, వసతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. "ఇంటెర్న్ షిప్" అయితేనే తమకు డిగ్రీ ఉత్తీర్ణత అయినట్లు అవుతుందని విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ డిడి మాట్లాడుతూ ఉన్నతాధికారుల సమస్య తెలిపి పరిష్కారానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు చుక్క మహేష్, బొండపల్లి జనార్ధన్, గొండగొర్రి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్ సర్వేలో మాకే అనుకూలం : వైసిపి

ప్రజాశక్తి - సాలూరు

జగనన్నే మా భవిష్యత్తు, జగనన్నే మా నమ్మకం కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని జగనన్న సచివాలయాల కన్వీనర్ గిరిరఘు చెప్పారు. సోమవారం డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి 15రోజులు పూర్తయిన సందర్భంగా పట్టణ నాయకులంతా స్టిక్కర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కన్వీనర్ గిరిరఘు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజలు నుంచి సానుకూల స్పందన లభిస్తోందని చెప్పారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు స్వచ్ఛందంగా జగనన్న ఫొటో ఉన్న స్టిక్కర్లను అంటించుకుంటున్నారని చెప్పారు. జగనే మళ్లీ సిఎం కావాలని కోరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ మాజీ అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, రాపాక మాధవరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ పువ్వల భరత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ :జగనన్నే మా భవిష్యత్తు మెగా పీపుల్ సర్వేలో వస్తున్న ఫలితాలు ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబిస్తున్నాయని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. సోమవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో పార్టీ పరిశీలకులు శోభా హైమావతితో కలిసి పార్వతీపురం అర్బన్, రూరల్ సచివాలయం కన్వీనర్లు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకుల సమక్షంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, మూడు మండలాలు, పట్టణ పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, బొంగు చిట్టిరాజు, కొండపల్లి బాలకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్, మామిడి బాబ్జి, బలగ రేవతమ్మ, మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్పర్సన్ కొండపల్లి రుక్మిణి, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, మూడు మండలాల జెసిఎస్ కన్వీనర్లు, పట్టణ జేసిఎస్ కన్వీనర్, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, సచివాలయం కన్వీనర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వార్డుల కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, వైసిపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

సాలూరు: స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

జియ్యమ్మవలస : కురుపాం నియోజకవర్గంలో నిర్వహిస్తున్న జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమానికి ప్రజల నుండి అపూర్వ స్పందన విశేష ఆదరణ లభిస్తుందని ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. చిన్నమేరంగిలో తన నివాస గృహంలో విలేకరులతో మాట్లాడుతూ విలేకరుల సమావేశంలో కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, జడ్పిటిసి ఎన్ శశికళ, కురుపాం ఎంపిపి శెట్టి పద్మావతి, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ ఎం గౌరీ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు

భామిని : మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం జెసిఎస్ కో -ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ సమీక్షించారు. మండలంలో ప్రజా ప్రతినిధులు ఇంటింటి వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కారం చూపడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, సీనియర్ వైసిపి నాయకులు కొల్ల రామారావు, బూరుజోల సర్పంచ్ మడపన కేశవ, రొక్కం రమేష్, గేదెల మోహన్, బొమ్మాలి సంజీవ్ రావు, పోతల చంద్రభూషణ,పోతల హరికృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్ శ్రావణ్ వున్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ముంపు గ్రామాల ప్రజల ఆందోళన పుస్తకావిష్కరణ

పార్వతీపురంరూరల్ : జీవించే హక్కు... పునరావాసం కోసం గిరిజనుల పోరాటం పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజల ఆందోళన పుస్తకావిష్కరణ సోమవారం స్థానిక రైతు కూలీ సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ పుస్తకాన్ని ప్రజా కళాకారుల సమాఖ్య రాష్ట్ర నాయకులు రౌతు వాసుదేవరావు ఆవిష్కరించారు. పుస్తక పరిచయాన్ని రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ సింహాద్రి ఝాన్సీ పరిచయం చేశారు. ఈమె మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల సమస్యలు, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిర్వాసితుల పోరాటం గురించి వివరించారు. నిర్వాసితుల పట్ల ప్రభుత్వం మొండివైఖరిపై వివరించారు.సభలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు, గిరిజనులు, రైతు కూలీలు ,రైతులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

ప్రజాశక్తి - భామిని

మండలంలోని కొసలి సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి ఎం. మహేంద్ర ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా చేపట్టారు. అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. పిల్లలకు క్విజ్, వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొసలి సర్పంచ్ మజ్జి మోహన్ బాబు, కేసరి పంచాయతీ నాయకులు వలురౌతు రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మండల స్థాయిలో ఎంపిక చేసిన ఉత్తమ పంచాయతీలలో భాగంగా పార్వతీపురం మండలంలో ఆరు పంచాయతీలు ఎంపికైనట్లు ఎంపిడిఒ విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎంపికైన సర్పంచులు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా పెద్ద బొండపల్లి, కృష్ణపల్లి, అడ్డాపుసిల, కవిటిభద్ర, గంగాపురం, పులిగుమ్మి సర్పంచులను సాలువాలతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్మన్ ఎం. భాగ్యలక్ష్మి, నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, బొమ్మి రమేష్, బలగ నాగేశ్వరరావు, మజ్జి చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: గిరిజన గ్రామాల అభివృద్ధి చెందాలంటే పంచాయతీరాజ్‌తోనే సాధ్యమని ఎంపిపి బి.ఆదినారాయణ అన్నారు. స్థానిక మండల పరషత్ కార్యాలయ ప్రాంగణంలో పంచాయతీరాజ్ దినోత్సవం ఎంపిడిఒ కొండపల్లి సత్యం అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం 28 సర్పంచులు, ఎంపిటిసిలను సత్కరించారు. సీతంపేట పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ అవార్డు గ్రహీత బి.సుదర్శనరావు ఘనంగా సత్కరించారు.



సీతంపేట: అవార్డు అందుకుంటున్న కార్యదర్శి సుదర్శనరావు

కార్యక్రమంలో వైస్ ఎంపిపి కె.సరస్వతి, సర్పంచులు పి.వీరన్న, కూర్మారావు, వెంకినాయుడు, తిరుపతిరావు, కార్యదర్శులు వినోద్, పాపారావు, ఉష, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలువురు సర్పంచులను అధికారులు ఘనంగా సన్మానించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు ఆధ్వర్యంలోని ఉత్తమ పంచాయతీలుగా ఎన్నికైన 12మంది సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో పారిశుధ్యం, అభివృద్ధి, సమస్యలు పరిష్కరించిన సర్పంచులకు ప్రభుత్వం ఉత్తమ పంచాయతీలుగా గుర్తింపు పొందడం సంతోషకరమని ఎంపిడిఒ అన్నారు. మండలంలోని 12 గ్రామపంచాయతీలను ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎంపికయ్యాయన్నారు. పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు కీలక పాత్ర వహించాలని, భవిష్యత్తులో పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలని సందర్భంగా కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన్ నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు ఎం.సూరపునాయుడు, వైసిపి నాయకులు శెట్టి మధుసూదనరావు, ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీతానగరం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సందర్భంగా పలు గ్రామపంచాయతీ సర్పంచులను ఎంపిడిఒ ఎంఎస్ఎన్ఎల్ ప్రసాద్ సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో పంచాయతీగా జోగింపేట సర్పంచ్ కె సింహాచలంకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది అన్నారు. అలాగే జిల్లా స్థాయిలో కలెక్టర్ జిల్లా పరిషత్ చైర్మన్ చేతుల మీదుగా పెదబోగిలి జామూళ్లలస, దయానిధి పురం సర్పంచులు అవార్డులు అందుకోవడం సంతోషదాయకమన్నారు. కొత్తవలస, చినబోగిలి చల్లంనాయుడువలసలో గ్రామసభలు నిర్వహించి సిబ్బందిని సన్మానించారు.

కురుపాం : పంచాయతీలు అభివృద్ధి చెందితేనే పరిపాలన బాగుంటుందని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకొని మండల స్థాయిలో వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయితీల సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ వివి శివరామప్ప ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు, రంగారావు, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఇఒ కె.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి. సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసిలు వి. బంగారు నాయుడు, టివిఎస్ స్వామియాజులు, జి.సంతోషిని, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య సేవలపై ఆరా

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం, మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల గుమ్మ, పి.లేవిడి, కొండ బారిడి గిరిజన గ్రామాలను సోమవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గర్భిణులు, హైరిస్క్ గర్భిణులు, బాలింతలు ఇంటి వద్దకు వెళ్లి వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వారు తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించి శిశువుల ఆరోగ్య పర్యవేక్షణ, చిన్నారుల బరువును పరిశీలించారు. మొండెంఖల్లో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు రక్తహీనత, సీజనల్ వ్యాధులు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రెండు పిహెచ్‌సిల రికార్డులు, టీకా నిల్వలు, ల్యాబ్‌లు, వార్డులను పరిశీలించి వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరికి సక్రమంగా వైద్యం అందించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బి.ప్రజ్ఞ , అభినవ్ కుమార్, అమరసింహారెడ్డి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

కొమరాడ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యాలు లేకుండా చూడాలని ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు అన్నారు. సోమవారం మండలంలోని కొమరాడ, కునేరు రామభద్రపురం పిహెచ్‌సిలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ రోగులు ఆసుపత్రికి వచ్చిన సమయంలో ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు సక్రమంగా అందించాలన్నారు. రోగులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా విద్యుత్తు సదుపాయం సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడిన సమయంలో జనరేటర్లతో విద్యుత్ సరఫరా చేసే విధంగా సిద్ధంగా ఉండాలని అన్నారు. పిహెచ్‌సిల నుంచి పార్వతీపురం ఆసుపత్రికి ఎందుకు రిఫరల్ చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా సమర్థవంతమైన వైద్య సేవలందించేలా కృషి చేయాలని కోరారు. ఈయనతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు తదితరులు ఉన్నారు.

బొమ్మికలో ఫ్యామిలీ డాక్టర్

భామిని : మండలంలోని బొమ్మిక గ్రామంలో భామిని పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ఫణి కుమార్ సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రోగులుకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ 25వ తేదీ మంగళవారం, వరల్డ్ మలేరియా డే సందర్భంగా, సున్నా మలేరియా కేసులు లక్ష్యంగా, భామిని మండలం కేంద్రంలో, ప్రతి సచివాలయం పరిధిలో వైద్య సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు కలిసి ర్యాలీ ద్వారా మలేరియా వ్యాధి గురించి వివరించి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై ప్రచారం చేయాలన్నారు. పిల్లలకు మలేరియా పై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని, జూన్ నెలలో మలేరియా స్ప్రేయింగ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ భాస్కర్ రావు, సబ్ యూనిట్ అధికారి అప్పారావు, ఎఎన్ఎం జీవిత సాహు పాల్గొన్నారు.

కురుపాం: విద్యార్థులతో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహనరావు

వీరఘట్టం : మండలంలోని సింధునగర్, కొట్టు గుమ్మడ గ్రామాల్లో సోమవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి ఉమామహేశ్వరి రక్తపోటు, మధుమేహ, బాలింతలు, చంటి పిల్లలు, గర్భిణులు, జ్వర పీడితులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నవోనమ్మ, ఏఎన్ఎం వై. రాజేశ్వరి, టెక్నీషియన్ దినేష్, హెల్త్ అసిస్టెంట్ మోహన్, 104 సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పందనకు 38 వినతులు

సీతంపేట: ఐటిడిఎ స్పందనకు 38 వినతులు వచ్చాయి. సోమవారం స్పందన కార్యక్రమం ఐటిడిఎలో పిఒ కల్పనా కుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. చిన్నచలం గ్రామానికి చెందిన కర్రయ్య విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. సూదిరాయి గూడకు చెందిన ప్రసాద్ తాగునీటి సౌకర్యం కల్పించాలని, మెట్టుగూడ గ్రామానికి చెందిన చిన్న బూదమ్మ టార్పన్ మంజూరు చేయాలని, కారెంకు చెందిన నిమ్మక రంభ కుట్టుమిషన్ మంజూరు చేయాలని, జక్కరపేటకు చెందిన ధర్మారావు రోడ్డు మంజూరు చేయాలని, మొర్లిపేటకు చెందిన పెద్దింటి సుశీల మినీ అంగన్వాడి కేంద్రం మంజూరు చేయాలని విన్నవించారు. పర్లాకిమిడికి చెందిన కారడ అక్బర్ పైనాపిల్ మొక్కలు సరఫరా బిల్లు మంజూరు చేయాలని, తోసురాడకు చెందిన రాజారావు ఏదైనా ఆశ్రమ పాఠశాలలో అటెండర్ పోస్ట్ ఇప్పించాలని కోరారు. నల్ల బొంతు గ్రామానికి చెందిన జమయ్య కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని కోరారు. గోయిది పంచాయతీ రసూల్ పేటకు చెందిన సవర చామంతి అనే బాలింత స్పందనలో వినతి సమర్పించగా పిఒ కల్పనా కుమారి స్పందించి లాక్టజన్ పాల ప్యాకెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎపిఒ రోషిరెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.మురళి, పిఎఒ హరికృష్ణ, సిడిపిఒ రంగలక్ష్మి, ఎడ్యుకేషన్ ఒఎస్‌డిఒ యుగంధర్, స్పోర్ట్స్ ఇంచార్జ్ జాకబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న పిఒ కల్పనాకుమారి

గణమ్మను కొనసాగించాలి

కలెక్టరేట్ :బలిజిపేట మండలం పి.చాకరపల్లి ప్రాథమిక పాఠశాలలో 20ఏళ్లుగా పనిచేస్తున్న తట్టుకోట గణమ్మను ఎటువంటి సమాచారం లేకుండా తొలగించిన పాఠశాల హెచ్ఎం ఎం. అప్పలనాయుడుపై చర్యలు తీసుకోవాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శాంతికుమారి, సిఐటియు కోశాధికారి జి.వెంకటరమణ, పట్టణ నాయకులు బి. సూరిబాబు, బాధితురాలు టి.గణమ్మ డిమాండ్ చేశారు. గణమ్మను మధ్యాహ్న భోజనం నిర్వాహకులుగా కొనసాగించాలని సోమవారం కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గణమ్మను రాజకీయ నాయకుల ఒత్తిడితో అకారణంగా తొలగించడం అన్యాయమని అన్నారు. గణమ్మ, బేవర శారద నెలకొకరు చొప్పున వంట చేసుకోవాలని హెచ్ఎం సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. దీని ప్రకారం ఈ నెల శారదమ్మ వంటచేయాల్సి ఉండగా ఆమె అనారోగ్యం సమస్య కారణంగా కొన్ని రోజులుగా పనిలో లేరు. ఈ విషయం గణమ్మకు స్కూల్ హెచ్ఎం ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఇద్దరు మానేసినట్టు పాఠశాల సిబ్బందిచే తప్పుడు తీర్మానం చేయించి ఎంఇఒకు పంపించారన్నారు. కేవలం రాజకీయ నాయకుల జోక్యం కారణంగానే గణమ్మను తొలగించి, వారికి సంబంధించిన వ్యక్తులకు ఆ స్థానం కల్పించడం దుర్మార్గమన్నారు. పాఠశాలలో 20 ఏళ్ల నుండి వంట చేస్తున్న గణమ్మకి వంట బాధ్యతలు కొనసాగించాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ట్యాంకర్ల ద్వారా నీరందించండి

సీతంపేట: గిరిజన గ్రామాల్లో తాగునీటి ఎద్దడి గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీరందించాలని ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఢిల్లేశ్వరరావు, ఎఇ పవన్ కుమార్‌కు ఆదేశించారు. నీటి ఎద్దడి గ్రామాలను గుర్తించాలన్నారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు.

తప్పు ల్లేకుండా భూ రీసర్వే

వీరఘట్టం : త్వరలో వీర ఘట్టంలో చేపట్టనున్న భూ రీ సర్వేను తప్పులు లేకుండా సర్వే చేయాలని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ విలేజ్ సర్వేయర్లకు ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలో రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. రైతుల భూములకు సంబంధించి ఎటువంటి తప్పిదాలూ లేకుండా సర్వే చేయాలన్నారు.ఈ సమావేశంలో గ్రామ రెవెన్యూ అధికారులు జి. సురేష్ కుమార్, అప్పలనాయుడు, ఎల్లయ్యతోపాటు గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

జనసేన ఆశయాలపై ప్రచారం

పార్వతీపురం రూరల్: జనసేన ఆశయాలను ప్రజల్లో ప్రచారం చేస్తూ ఆ పార్టీ అభివృద్ధికి ప్రజలు ఆదరించాలని పార్వతీపురం నియోజకవర్గ నాయకులు అక్కేన మోహనరావు కోరారు. సోమవారం జనసేన కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు మండలంలో కృష్ణపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ వేతనదారులతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ అధికారంలోకి వస్తే గ్రామ సమృద్ధిని సాధిస్తూ కూడు, గూడు, గుడ్డ లేని సమసమాజం జనసేనతో సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ జనసేనలో చేరి వచ్చే ఎన్నికల్లో పవన్ కళ్యాణ్‌ను సిఎంగా చూడాలన్నారు. కృష్ణపల్లిలో కల్యాణ మండపం నిర్మాణానికి రూ.50వేలు విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు ఆగురు మణి, బోనేల గోవిందమ్మ, గుండ్రెడ్డి గౌరీశంకర్, బంటు శిరీష, చిట్లు గణేశు, తేజ, పవన్, రమేష్, అప్పలనాయుడు, ఈశ్వరరావు, ఉపేంద్ర, రాజు, రామకష్ణ, ప్రవీణ్, హరీష్ తదితర జనసైనికులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

పార్వతీపురంటౌన్: గ్రామదేవతలు ఇప్పలపోలమ్మ, ఎర్ర కంచమ్మ, బంగారమ్మ తల్లుల పండగకు కనీస సౌకర్యాలు కల్పించాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. సోమవారం జిల్లా ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండగ నేపథ్యంలో మున్సిపాలిటీలో ఇప్పటి నుంచే పారిశుధ్య నిర్వహణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. వరహాలగెడ్డలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు వి.దాలినాయుడు, రాజాన రాంబాబు, అన్నా బత్తుల దుర్గాప్రసాద్, రౌతు బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బైక్ బోల్తా ; ఉద్యోగి మృతి



మృతి చెందిన లక్ష్మి

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఇరిడి పంచాయతీ కొత్తగూడ సమీపాన లిక్కిడి వద్ద బైక్ బోల్తాపడి ఉద్యోగి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే అనూష, పిన్నింటి లక్ష్మి అనే ఇద్దరు ఉద్యోగులు సోమవారం తాడికొండ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఎల్విన్‌పేట సబ్ సెంటర్‌కు వస్తుండగా మార్గమధ్యలో లిక్కిడి సెంటర్ వద్ద అనూష టోపి ఎగిరిపోతుండగా లక్ష్మి ఆ టోపీని పట్టుకోడానికి ప్రయత్నించగా, బైక్ బోల్తా పడింది. దీంతో లక్ష్మి తలకు బలమైన దెబ్బ తగలడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. లక్ష్మి ఎల్విన్‌పేట సచివాల యంలో ఎంఎల్‌హెచ్‌పిగా విధులు నిర్వహిస్తుంది. ఆమె స్వగ్రామం మక్కువ మండలం మర్కొండపుట్టి. మరో ఉద్యోగిని అనూషకు తీవ్రగాయా లయ్యాయి. ఆమెను భద్రగిరి ప్రాథమిక ఆసుపత్రికి తరలించారు. ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదమ్ముల ఘర్షణ

బలిజిపేట: మండలంలోని నారాయణపురానికి చెందిన అన్నదమ్ముల ఘర్షణలో తమ్ముడు దాడితో అన్న గాయపడినట్టు ఎస్సై ఎన్.ప్రశాంత్ కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపురానికి చెందిన అన్నదమ్ములు గురాన వెంకటరమణ, గురాన రామినాయుడు కళ్లం పంపకాల్లో దీర్ఘకాలంగా తగాదాలు జరుగుతున్నాయి. దీంతో వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం రామినాయుడు వెళ్లి చంపాలన్న ఉద్దేశంతో తన అన్నయ్యను బలంగా కొట్టగానే వెంకటరమణ అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయాడని, బంధువులు బొబ్బిలి ఆసుపత్రికి, అక్కడ నుంచి విజయనగరం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వెంకటరమణ కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.